క్లుప్తంగా

'సర్వే చేయించుకుని.. డబ్బులు ఇవ్వడం మరిచారు'

భిక్కనూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గత నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను తమ చేత ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని ఇప్పటి వరకు తమకు డబ్బులు ఇవ్వలేదని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ విద్యార్థులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. తాము డిసెంబర్‌లో రాత్రి పగలు అహర్నిశలు శ్రమించి భిక్కనూరు, దోమకొండ, కామారెడ్డి మండలాలకు చెందిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. తమకు ఒక్కో కుటుంబం వివరాల ఆన్‌లైన్ నమోదుకు రూ.15 నుంచి 20 వరకు చెల్లిస్తామని భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ తమతో పనిచేయించాడన్నారు. తాము డబ్బులు అడిగితే బిల్లులు రాలేదని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు త్వరగా చెల్లించాలని సౌత్ క్యాంపస్‌లోని జియో ఇన్ఫర్మాటిక్స్, సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌లకు చెందిన 40 మంది విద్యార్థులు డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



భిక్కనూరు: సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన ఆసిలి శ్రీనివాస్–సవిత దంపతులు గురువారం రూ.50 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు కొడకండ్ల రామగిరి శర్మ విరాళ దాతల పేరిట స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాన్ని స్వామి వారి శేష వస్త్రాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సరస్వతి ప్రభాకర్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శి మృతికి సంతాపం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి కొండా నర్సింలు(58) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందడంతో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది, పాలక వర్గం సభ్యులు తీవ్ర సంతాపం తెలిపారు. గురువారం సాయంత్రం కామారెడ్డి పెద్ద చెరువు శ్మశానవాటికలో నర్సింలు అంత్యక్రియలు నిర్వహించారు.

మాలోత్ తండాలో కబడ్డీ పోటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మాలోత్ తండాలో గురువారం సద్గురు సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి పలు జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపొందిన వారికి మెమొంటోలు, నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. నిర్వాహకులు ప్రకాష్‌నాయక్, లాల్‌సింగ్, రవీందర్, వినోద్, మోహన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాల్‌రాజు

కామారెడ్డి అర్బన్: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం(ఏఐఏవైఏ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బట్టెంకి బాల్‌రాజును నియమిస్తూ జాతీయ సమన్వయకర్త వరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. బాల్‌రాజుకు భారత రాజ్యాంగంతో పాటు నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.శ్రీశైలం, రాష్ట్ర కార్యదర్శి చెవ్వ లింగంలు.. బాలరాజును అభినందించారు.

ఆంగ్ల భాషా దినోత్సవం



భిక్కనూరు: జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరోజిని నాయుడు జయంతిని పురస్కరించుకుని ఆంగ్లభాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఆంగ్ల భాషను తేలికగా నేర్చుకోవచ్చని, ఎలాంటి భయాందోళనకు గురికావద్దని విద్యార్థులకు సూచించారు. ఆంగ్ల భాషా ప్రాధాన్యతను తెలియజేసే టీఎల్‌ఎం మేళాను నిర్వహించారు. విద్యార్థులు ఆంగ్లంలో తయారుచేసిన పాఠ్యాంశాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- కంచెలు నిర్మించాలని కోరుతున్న స్థానికులు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని పలు ప్రాంతాలలో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పోలీస్‌స్టేషన్ సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేవు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు లేని కారణంగా పశువులు అటువైపు వెళ్లి మేత మేస్తున్నాయి. చిన్న పిల్లలు, విద్యార్థులు కూడా ఆడుకోవడానికి వెళ్లి ప్రమాదం బారిన పడే అవకాశముంది. ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ సమీపంలో కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో..



ఎల్లారెడ్డి జెడ్పీ బాలుర పాఠశాల సమీపంలో..

త్వరలోనే ఏర్పాటు చేస్తాం

కంచెలకు సంబంధించి ఫ్రేమ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అవి పూర్తి కాగానే కంచెల నిర్మాణం చేసి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలను తీసుకుంటాం.

– వెంకటస్వామి, ట్రాన్స్‌కో ఏఈ, ఎల్లారెడ్డి

అభ్యంతరాలుంటే తెలపాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

దోమకొండ: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా విడుదలైన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఈనెల 14(నేడు)న తెలియజేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తుది జాబితా ఈ నెల 15న ప్రచురిస్తామన్నారు. వివిధ పార్టీల నాయకులు అనంత్‌రెడ్డి, సీతారాం మధు, స్వామి, నల్లవు శ్రీను, రాజేష్, నాగరాజు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలతోపాటు ఓటర్‌జాబితా డ్రాఫ్టింగ్‌పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో ప్రభాకర్‌చారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే లిఖిత పూర్వంగా తమకు తెలియజేయాలని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, జూనియర్ అసిస్టెంట్ అరుణ్, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. గురువారం రాజకీయ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఆ పోలింగ్ కేంద్రాల్లో అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని నేతలను కోరారు. సమావేశంలో ఎంపీవో మలహరి, ఆయా పార్టీల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, దివిటి రమేశ్, బొల్లారం క్రాంతి, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో సత్ఫలితాలు



పాల్వంచలో బోధనోపకరణాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ..



బస్వాపూర్‌లో సమావేశమైన ఉపాధ్యాయులు

మాచారెడ్డి: విద్యార్థులకు బోధనోపకరణాలతో పాఠాలు చెబితే సత్ఫలితాలు వస్తాయని మాచారెడ్డి, పాల్వంచ మండలాల విద్యాశాఖ అధికారులు దేవేందర్‌రావు, రాంమనోహర్ రావులు అన్నారు. గురువారం పాల్వంచ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు.. మేళాకు హాజరైన ఉపాధ్యాయులకు వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి, గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు ఉన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): బోధనోపకరణాలను ఉపయోగించి విద్యా బోధన చేయాలని మండల విద్యాధికారి షౌకత్ అలీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, శెట్పల్లి, నల్లమడుగు, లింగంపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బోధనోపకరణాల మేళాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వసుధ, శేషయ్య, కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో సమావేశం

భిక్కనూరు: బస్వాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం గురువారం జరిగింది. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారెడ్డి, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుడు జయదేవ్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి



మద్నూర్(జుక్కల్): భారతకోకిల సరోజినీ నాయుడు సమాజానికి చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్స్‌పాల్ నందాల గంగాకిశోర్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం సరోజినీనాయుడు జయంతి, జాతీయ అంగ్లభాష, ప్రపంచ ఆకాశవాణి దినోత్సవాలను నిర్వహించారు. సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి అక్షరాంజలి ఘటించారు. ఆంగ్ల భాష నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకోవాలని ఆయన అన్నారు. వైస్ ప్రిన్స్‌పాల్ సుమన్, ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సును జయప్రదం చేయాలి



కామారెడ్డి టౌన్: ఈ నెల 28న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫాసిస్ట్, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సురేష్, నాయకులు ప్రకాష్, అనీస్, నర్సిరెడ్డి ఉన్నారు.

రేపటి నుంచి ఖండేరాయ ఉత్సవాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్నూర్‌లోని ఖండేరాయ ఆలయ ఉత్సవాలను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దొడ్లె రవి తెలిపారు. ప్రత్యేక పూజలతో పాటు భారీ ఎత్తున అన్నదానం వంటి తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పీఎంపీ, ఆర్‌ఎంపీల ఆత్మగౌరవ సభకు తరలి రావాలి



భిక్కనూరు: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 18న నిర్వహిస్తున్న గ్రామీణ పీఎంపీ, ఆర్‌ఎంపీల ఆత్మగౌరవ సభకు జిల్లాలోని పీఎంపీ, ఆర్‌ఎంపీలందరూ తరలి రావాలని జిల్లా పీఎంపీ, ఆర్‌ఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. పీఎంపీ, ఆర్‌ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సభలో చర్చించనున్నట్లు తెలిపారు. సుదర్శన్, గంగాధర్, తేజాస్కర్, బాల్‌కిషన్, నక్క శ్రీనివాస్, అంజనేయులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): వేసవిలో 41 గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి కొరత లేకుండా చూడాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు రాని రోజుల్లో గ్రామాల్లో ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని సూచించారు. ఎంపీవో మలహరి పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నేతలు

బాన్సువాడ : బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలోని జుక్కల్ మండలంలోని దోస్పల్లి, బంగాపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని గురువారం పీడీఎస్‌యూ, టీఎస్‌పీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్టీసీ డీఎం సరితాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు బాల్‌రాజ్, మాపురం శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. జుక్కల్ మండల కేంద్రానికి విద్యనభ్యసించడానికి వచ్చే దోస్పల్లి, బంగారుపల్లి గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఆటోలలో వెళ్తున్నారని అన్నారు. ఆటోలలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఆటోల టాప్‌లపై ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తుందని అన్నారు. వెంటనే ఆ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

కనీస సామర్థ్యాలు వచ్చేలా విద్యా బోధన చేయాలి



పిట్లం(జుక్కల్): విద్యార్థులకు కనీస సామర్థ్యాలు వచ్చేలా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఎంఈవో దేవిసింగ్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిట్లం, చిన్న కొడప్గల్‌లకు చెందిన ఉపాధ్యాయులు, ఎంఈవో దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల నోడల్ అధికారి రమణారావు పాఠశాలల వారీగా రివ్యూ నిర్వహించారు. చిన్న కొడప్గల్ జెడ్పీహెచ్‌ఎస్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అనురాధ, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు హైమద్ భాషా, విట్టవ్వ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను వేగవంతం చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి కూలీల శాతాన్ని పెంచాలని ఇన్‌చార్జి ఏపీవో కృష్ణ గౌడ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఫీల్డు అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి గ్రామంలో 50 నుంచి 100 మంది కూలీలు పనికి రావాలని, అందుకు అనుగుణంగా వారికి పనులు కల్పించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అలాగే వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు మహిపాల్‌రెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళాబృందం సభ్యులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. గురువారం లింగంపేట బస్టాండులో ప్రయాణికులకు సైబర్ నేరాలు జరుగుతున్న తీరు గురించి వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పొద్దని, ఆన్‌లైన్ లింక్‌లు ఓపెన్ చేయవద్దన్నారు. అలాగే లాటరీలు, లోన్‌లు ఇస్తామని ఫోన్ ద్వారా బ్యాంక్ ఖాతా వివరాలు అడిగితే ఇవ్వవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మహిళా శిశు సంరక్షణ, షీ టీమ్(8712686094), సైబర్ నేరాల బారిన పడినప్పుడు 1930 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయండి



కామారెడ్డి టౌన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 14న తలపెట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఎడ్ల రాజు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ బంద్‌కు జిల్లాలోని ప్రజలు, వ్యాపారులు, విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈవో శ్రీహరి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కాంప్లెక్స్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుద్ధభేరి వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



లింగంపేట బాలికల ఉన్నత పాఠశాలలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు



పాల్వంచ ఉన్నత పాఠశాలలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు, లింగంపేట ఉన్నత పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయులు యుద్ధభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా మార్చి 2న హైదరాబాదులోని ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న యుద్ధభేరి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండు చేశారు. ఓపీఎస్ వచ్చే వరకు ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శోభారాణి, కోటేశ్వర్‌రావు, సూరయ్య, పద్మ, రజిని పాల్గొన్నారు.

మాచారెడ్డి: యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా జరుపతలపెట్టిన యుద్ధభేరి వాల్‌పోస్టర్లను గురువారం పాల్వంచ ఉన్నత పాఠశాలలో టీఎస్‌సీపీఎస్ ఈయూ ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో రాంమనోహర్‌రావు, హెచ్‌ఎం గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాణాల భాస్కర్ రెడ్డి, పటేల్ అనిల్, లింగం, ప్రశాంత్, రాజు, మహేశ్, స్రవంతి ఉన్నారు.

సంక్షిప్తం

మాజీ పోలీస్ పటేల్ మృతి



భిక్కనూరు: భిక్కనూర్ మాజీ పోలీస్ పటేల్ జగ్గన్నగారి విఠల్‌రెడ్డి(82) గురువారం వేకువజామున మృతి చెందారు. అయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భిక్కనూరు పోలీస్ పటేల్‌గా విఠల్‌రెడ్డి 1984 వరకు పనిచేశారు. అప్పటి సీఎం ఎన్టీఆర్, పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేయడంతో పోలీస్ పటేల్ వ్యవస్థ కూడా రద్దయింది. విఠల్‌రెడ్డి అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో జరిగాయి. పలు గ్రామాల నేతలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

ధరావత్ మౌనికను అభినందనలు

కామారెడ్డి అర్బన్: రాజధాని ఢిల్లీలో రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొని వచ్చిన స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని ధరావత్ మౌనికను గురువారం ప్రిన్సిపల్ విజయ్ కుమార్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొనడం గొప్ప అనుభూతి, గౌరవాన్ని ఇచ్చిందని మౌనిక ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎన్‌సీసీ అధికారి, లుటినెంట్ ఎ.సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కామారెడ్డి టౌన్: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) కామారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా ఐదో మహాసభల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్ గురువారం ప్రకటించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా ఎస్. అజయ్, కార్యదర్శిగా ముదాం అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా కే. రాహుల్, సహాయ కార్యదర్శిగా ఎస్.నితిన్, జిల్లా కమిటీ సభ్యులుగా మణికంఠ, నవీన్, సాయి ప్రకాష్ గౌడ్, విలాస్, ప్రశాంత్, శ్రీకాంత్, అశోక్ నాయక్‌లను ఎన్నుకున్నారు.

'బాలు సేవలు అభినందనీయం'

కామారెడ్డి అర్బన్: రక్తదానంలో విశేష సేవలు అందించడంతో పాటు ఇండియా బుక్ ఆఫ్ రికార్డు నమోదు చేసుకున్న రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు బాలును స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాల తరఫున ప్రిన్సిపల్ ఎంఏ రషీద్, విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. అధ్యాపకులు కళ్యాణ్, చరణ్‌గౌడ్, కిషన్, బీమాగౌడ్, మమత, తయిబా పాల్గొన్నారు.

'పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ, భరోసా ఇవ్వాలి'

కామారెడ్డి అర్బన్: పూర్తిస్థాయిలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వాలని, వేసవి దృష్ట్యా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అధ్యక్షతన పట్టణ పరిధిలోని లింగాపూర్ శివారులోని కొమిరెడ్డి అంజన్న వ్యవసాయ క్షేత్రంలో గురువారం బీకేఎస్ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనంద్‌రావు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై వివరించారు.

జగదాంబదేవి ఆలయంలో పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నందివాడ తండాలోని జగదాంబదేవి, సేవాలాల్ ఆలయాలలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా లంబాడీ కులస్తులు సురేందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.